నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | శుక్రవారం 8 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

అలంకరణలో వేయిస్తంభాల రుద్రేశ్వరుడు

సర్వం.. శివమయం

ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న శివాలయాలు
నేటి మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబు
మహాశివుని దర్శనానికి పోటెత్తనున్న భక్తులు
అంతటా జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు


విద్యుత్ వెలుగుల్లో గణపురం కోటగుళ్లు

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలన్నీ ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నాయి. మంగళతోరణాలు.. విద్యుత్ దీపాలతో ముస్తాబై కాంతులీనుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం, కోటగుళ్లు, హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయం, ములుగులోని రామప్ప, పాలకుర్తి కనకసోమేశ్వరాలయం, వరంగల్ కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, ఖిలా వరంగల్ స్వయంభూ శంభు లింగేశ్వరాలయం, కోటిలింగాల, భట్టుపల్లి శివాలయం, కురవి వీరభద్రస్వామి ఆలయం, కొడవటూరు సిద్ధేశ్వరాల యంలో పండుగ ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వేలాది మంది భక్తులు మహాశివుని దర్శనం కోసం తరలిరానుం డగా ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగనున్నాయి. రాత్రివేళ జాగరణ సందర్భంగా భక్తుల కోసం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పండ్లు, పూలు, దీపంతెల కొనుగోళ్లతో మార్కెట్లన్నీ గురు వారం కిటకిటలాడాయి. కాగా కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పార్వతి అమ్మవారికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర్‌రావు దంపతులు అందజేసిన బంగారు కిరీటాన్ని అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి వేళ ముక్తీశ్వర, శుభానంద అమ్మవారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణలతో ఎదుర్కొన్నారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 7

ముస్తాబైన వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణమండపం

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ సుడిగాలి పర్యటన

అధికారులతో వరుణ్‌రెడ్డి సమీక్ష

కృష్ణకాలనీ, మార్చి 7 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టీఎస్ ఎన్ పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి గురువారం సుడిగాలి పర్యటన చేపట్టారు. రేగొండ మండలంలోని చెన్నాపూర్ 11 కేవీ ఫీడర్‌ను, చిట్యాల, టేకు మట్ల మండలాల్లో మోరంచ వరదల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను తనిఖీ చేశారు. గృహలక్ష్మీ పథకంలో జీరో బిల్ రాని వినియోగదారులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో నమోదు చేసుకునేలా అధికారులు సూచించాలన్నారు. గణపురం మండలంలోని చెల్పూర్ కేటీపీపీ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయంలో అధికారులతో సమా వేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ బీ మల్సూర్, డీఈ నాగ రాజు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేగొండ మండలం చెన్నాపూర్‌లో నిరంతర విద్యుత్ కోసం చేసిన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సీఎండీ

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

బీఆర్ఎస్‌దే విజయం

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి.. 16 మంది కౌన్సిలర్ల మద్దతుతో ఎన్నిక

కృష్ణకాలనీ, మార్చి 7 : భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవిని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఆర్డీవో మంగీలాల్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. బీఆర్ఎ స్‌కు చెందిన 27వ వార్డు కౌన్సిలర్ గండ్ర హరీశ్‌రెడ్డి వైస్ చైర్మ న్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు 15 మందికి తోడు సీపీ ఐకి చెందిన కౌన్సిలర్ మద్దతివ్వడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. వివ రాల్లోకి వెళితే.. బీఆర్ఎస్‌కు చెందిన కొత్త హరిబాబు డిసెంబర్‌లో భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. అయితే ఈ ఎన్నిక నిర్వహణలో కలెక్టర్ ఆసక్తి చూప కపోవడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో ఈసీ వెంటనే ఎన్నిక చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించినప్పటికీ స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే విజ్ఞప్తితో అది వాయిదా పడింది. తిరిగి గురువారం ఎన్నిక నిర్వహించాలన్న ఈసీ ఆదేశాల మేరకు ఆర్డీవో బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది, కాంగ్రెస్‌కు చెందిన 12 మంది, బీజేపీ, సీపీఐ నుంచి ఒకరి చొప్పున మొత్తం 30 మంది కౌన్సిలర్లకు నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ నాయకులు ఎన్నిక జరగకుండా అనేక అడ్డంకులు సృష్టించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకునేందుకు యత్నించారు. కేసులు పెడతామంటూ బెదిరించి అభాసుపాలయ్యారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎన్నిక నిర్వహించగా, బీఆర్ఎస్ నుంచి 15 మంది (ఒకరు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు)తో పాటు సీపీఐ కౌన్సిలర్ మొత్తం 16 మంది హాజరయ్యారు. అయితే 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఎన్నికను మరో గంటపాటు వాయిదా వేశారు. అయినప్పటికీ వారు రాకపోవడంతో ఆర్డీవో ఎన్నికను చేపట్టడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సూచన మేరకు 27వ వార్డు కౌన్సిలర్ గండ్ర హరీశ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, 27వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం వద్దకు తరలివచ్చి హరీశ్‌రెడ్డిని పూలమాలతో సత్క రించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించడంతో పాటు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

యూనివర్సిటీ తరగతుల కోసం జాకారంలో ఏర్పాటు చేసిన వైటీసీ భవనం

కేసీఆర్ పోరాట ఫలితమే
గిరిజన యూనివర్సిటీ

నేడు ములుగులో క్యాంపస్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
రూ.889.07 కోట్లతో ఏర్పాటు.. 335.04 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు

ములుగు, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి వచ్చిన గిరిజన యూనివర్సిటీని కేసీఆర్ ప్రభుత్వం ములుగులో ఏర్పాటు చేసేందుకు 2018లో నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం గట్టమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ, అటవీ శాఖకు చెందిన 335.04 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేంద్ర మానవ వన రుల అభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ 2018 డిసెంబర్ 31న యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను పరిశీలించి తుది నిర్ణయం తీసు కున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం కేటాయించ డంతో పాటు యూనివర్సిటీ ఏర్పాటు, తాత్కాలిక తరగతుల నిర్వహణకు ములుగు మండలం జాకారం వైటీసీ భవనాన్ని కేటాయించింది. కేంద్ర ప్రభుత్వానికి భూములు అప్పగించగా ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ములుగు జిల్లా కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మేడారం సమ్మక్క సారక్కగా నామకరణం చేయనున్నట్లు వెల్లడించారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్దేశించిన బిల్లును ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీనిని రాజ్యసభ కూడా ఆమోదించి రాష్ట్రపతికి పంపించగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి అనుమతితో గెజిట్ విడుదల చేసింది. రూ.889.07 కోట్ల నిధులతో యూనివర్సిటీ ఏర్పాటు చేయను న్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నాటి నుంచి మొన్నటి వరకు యూనివర్సిటీ ఏర్పాటు, తరగతుల ప్రారంభానికి కేసీఆర్ చేసిన కృషి ఈ విద్యా సంవత్సరంలో తీరనుంది. జాకారం వైటీసీ భవనంలో ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను నేడు రాష్ట్ర మంత్రితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

సమ్మక్క-సారక్క పేరుతో యూనివర్సిటీ

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరున్న సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన యూనివర్సిటీని ములుగులో ఏర్పాటు చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో తరగతు లను ప్రారంభించేందుకు జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను యూనివర్సిటీకి అప్పగించగా మానవ వనరుల అభివృద్ధి శాఖ అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. యూనివర్సిటీ నిధులతో మరమ్మతులు చేసి తరగతి గదుల కోసం మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేశారు. నేడు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రి ధనసరి అన సూయ (సీతక్క)తో కలిసి తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభిం చనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో అధికారులు పూర్తి చేశారు.

కాంగ్రెస్.. మోసకారి

అమలుకాని హామీలతో అధికారం

రైతులను నట్టేట ముంచిన హస్తం నాయకులు

సాగునీరు, కరెంటు కష్టాలు మొదలు.. రైతుబంధు, రుణమాఫీపై స్పష్టత లేదు
సీఎం రేవంత్‌కు కుర్చీ ఎక్కడ కదులుతుందోనని భయం పట్టుకుంది
వంద రోజుల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత
విలేకరుల సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, మార్చి 7 : 'మోసానికి పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీ అని, అమలు కానీ హామీలు, మాయమాటలు చెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచి, అప్పుల పాలు చేసిం దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. సాగు, తాగు నీరు లేక కరెంటు కష్టాలతో రైతులకు మళ్లీ పాత రోజులు రానున్నాయన్నారు. గురువారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల కావస్తున్నా పూర్తి స్థాయిలో హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ప్రజలను మోసం చేసిం దుకు ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 31వ తేదీ లోగా రైతులందరికీ రైతు బంధు డబ్బులు జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికి మూడు ఎకరాలున్న రైతులకు కూడా రైతుబంధు రాలేదని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలం రాముడి సన్నిధిలో ప్రారంభిస్తామని గొప్పలు చెప్పుకుంటున్నదని ఎద్దేవా చేశారు. ఈ ఆర్థిక సంవత్స రంలో నియోజకవర్గానికి 3,500ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ. 7,740కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇండ్ల నిర్మాణం పూర్తి కావాలంటే రూ.25వేల కోట్లు కావాలని కడియం తెలిపారు. ప్రజా పాలన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీ మాత్రమే జరిగిందని, ఇప్పటివరకు విధివిధానాలు రూపొం దించలేదని, పథకానికి సరిపడా నిధులు కేటాయించకుండా ప్రారం భించడమంటే తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని పేర్కొ న్నారు. ఈ నెల 11న పథకం ప్రారంభిస్తామని చెప్పారని, 13,15వ తేదీల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అదే జరిగితే కోడ్ అమలులో ఉందని పథకం అమలు చేయడం సాధ్యం కాలేదని చెప్పేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డులు ఉన్నవారు 90లక్షల మంది ఉంటే నిబంధనల పేరుతో 29లక్షల మందికే రూ. 500గ్యాస్ పథకం అమలు చేస్తున్నారన్నారు. అలాగే 200 యూనిట్ల ఫ్రీ కరెంటు అని చెప్పి అంతకు మించి ఒక్క యూనిట్ ఎక్కువ కాల్చినా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాల్సిందేనని నిబంధన పెట్టడం బాధాకరమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కానిస్టే బుల్, స్టాఫ్ నర్స్, సింగరేణి, గురుకుల టీచర్లు ఇలా అనేక నోటిఫికే షన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి పైనల్ జాబితా ప్రకటించిన తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. బీఆ ర్ఎస్ పాలనలో ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందనడం ఇంతకన్నా సిగ్గులేని అంశం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ నున్నాయని, సాగునీటి కష్టాలు రానున్నాయని అన్నాడంటే వాటర్ మేనేజ్‌మెంట్ విషయంలో సీఎంకు అవగాహన లేదని అర్థం అవు తున్నదన్నారు. రిజర్వాయర్లు ఎండిపోయి భూగర్భ జలాలు తగ్గుతుం డడంతో అధికారులు, రైతులను అప్రమత్తం చేయకుండా ప్రతిపక్షా లపై సీఎం విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎంగా ఉండి రాష్ట్ర పరిపాలన, రాబోయే పరిస్థితులను అంచనా వేయ డంలో రేవంత్‌రెడ్డికి అవగాహన లేకపోవడం సిగ్గుచేటన్నారు. రైతు నేస్తం ప్రారంభం కార్యక్రమంలో సీఎం మాట్లాడిన తీరు హాస్యాస్ప దంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన సభలో తన జేబులో ఎప్పుడూ కత్తెర ఉంటుందని, తోక ఆడించేవాడి తోక కత్తిరించేందుకనని అనడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీని బూచిగా చూపి మంత్రులను హెచ్చరిస్తున్నట్లు ఉందని పేర్కొ న్నారు. రేవంత్‌రెడ్డికి తన కుర్చీ కదులుతుందేమోనని భయం పట్టు కుందని, బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీని కూలదోయాలనే ఆలోచన లేదని అన్నారు. వంద రోజులు గడువక ముందే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నా రని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు పాల్పడి బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలను పార్టీ మార్చడం సిగ్గు చేటన్నారు. వరంగల్ పార్ల మెంట్ అభ్యర్థి విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకొని విజ యావకాశాలు ఉన్నవారికే టికెట్ ఇస్తారని కడియం స్పష్టం చేశారు.